సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 17 । మార్చి । 2023



మృతులు వీరే.. ఇన్‌సెట్‌లో శ్రావణి (ఫైల్)



స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం

- భవనం మొత్తం చుట్టుముట్టిన మంటలు, దట్టమైన పొగ
- చిక్కుకుపోయిన 14 మంది రెస్క్యూ

పొగ ప్రభావంతో కన్నుమూసిన నలుగురు యువతులు, ఇద్దరు యువకులు

- ఇంకా లోపల ఎవరైనా ఉన్నారా అనే ఉత్కంఠ
- కొనసాగుతున్న సహాయక చర్యలు.. మరొకరి పరిస్థితి విషమం
- ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి



స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఎగిసిపడుతున్న మంటలు





అంబులెన్స్‌లో క్షతగాత్రుడి తరలింపు

పొగ మింగిన బతుకులు

ఆరుగురు బలి



సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్‌లోని ప్రముఖ వ్యాపార సముదాయం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదం ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సాయంత్రం అయిదో అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రారంభమైన మంటలు భవనంలోని మిగతా అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లో మొత్తం 14 మంది చిక్కుకుపోయారు. వీరిని అగ్నిమాపక, డీఆర్‌ఎఫ్ అధికారులు బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్‌తో రెస్క్యూ చేశారు. పొగ పీల్చిన ఆరుగురు అసువులు బాశారు.

సాయంత్రం 6.30– 6.45 గంటలు..

బీ బ్లాక్ అయిదో అంతస్తులోని ఓ గోదాములో మంటలు చెలరేగాయి. తొలుత దట్టమైన పొగ వ్యాపించింది. కొద్దిసేపటకు అగ్నికీలలు పెరిగి ఆరు, ఏడు, ఎనిమిది అంతస్తులతో పాటు నాలుగో అంతస్తుకూ పాకాయి. పొగ, మంటల్ని గమనించిన కొందరు కాంప్లెక్స్ వదిలి బయటకు వచ్చేశారు. కాంప్లెక్స్ మొత్తానికి ఒకే మెట్ల మార్గం ఉండటం, అది ఇరుకు రావడంతో పాటు పొగ కారణంగా అయిదు నుంచి ఎనిమిదో అంతస్తుల్లో ఉన్న వాళ్లు బయటకు రాలేకపోయారు. ఇలా మొత్తం 14 మంది కాంప్లెక్స్‌లో చిక్కుకుపోయారు. అయిదో అంతస్తులోని బీఎం5 అనే ఈ–కామర్స్ కార్యాలయంలో పది మంది, ఎనిమిదో అంతస్తులోని తుకారాంగేట్ కానిస్టేబుల్ రవి ఇంట్లో అతడితో పాటు తల్లి భారతమ్మ, తండ్రి చిక్కుకుపోయారు. వీరిలో కొందరు టాయిలెట్స్ వైపునకు వచ్చి తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేయడంతో పాటు తమ సెల్‌ఫోన్లలోని లైట్లు ఆన్‌చేసి చూపిస్తూ తాము ప్రమాదంలో ఉన్నట్లు, రక్షించాలంటూ సైగలు చేశారు.

రాత్రి 7.30 గంటలు..

పది ఫైరింజన్లు, మరో అరగంటకు బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. డీఆర్‌ఎఫ్ చీఫ్ ప్రకాష్‌రెడ్డి తన బృందంతో వచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు.

రాత్రి 8.45 గంటలు

అయిదో ఫ్లోర్ నుంచి ముగ్గురు యువకులను రెస్క్యూ చేశారు. ఇలా కిందికి వచ్చిన వాళ్లు తమ కార్యాలయంలోని స్టోర్ రూంలో ఆరుగురు చిక్కుకుపోయారని, వీరిలో శివ, ప్రశాంత్, ప్రమీల, త్రివేణి, శ్రావణి, వెన్నెల కూడా ఉన్నారని చెప్పారు.

రాత్రి 9.06 గంటలు..

భారతమ్మ, రవి, ఇతడి తండ్రి దయాకర్‌తో పాటు మరో మహిళ, ప్రశాంత్‌ను రెస్క్యూ చేసి ఆస్పత్రికి తరలించారు. ఓ యువకుడు అయిదో అంతస్తులోని కార్యాలయంలో చిక్కుకున్న వారికి ఊపిరి ఆడట్లేదని, వాళ్లు బయటకు రావడానికి ఇనుప గ్రిల్ అడ్డంగా ఉందని చెప్పి ఆక్సిజన్ ఆవశ్యకతను అధికారులకు వివరించాడు. దీంతో గ్రిల్స్ కట్ చేసే సామగ్రితో బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్‌లో పైకి వెళ్లారు.

రాత్రి 9.19 గంటలు..

డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు ఆక్సిజన్ సిలిండర్లు ధరించి, తీసుకుని మెట్ల మార్గంలో కాంప్లెక్స్‌లోకి వెళ్లే ప్రయత్నాలు మొదలెట్టారు. భవనంలోనే ఉండిపోయిన ఆరుగురి కోసం గాలింపు ముమ్మరం చేశారు.

రాత్రి 9.45 గంటలు

అయిదో అంతస్తులోని ఓమెగా సంస్థ కార్యాలయంలో చిక్కుకుపోయిన దాని యజమాని సుధీర్‌ను కిందికి తీసుకువచ్చారు. అదే అంతస్తులోని ఈ–కామర్స్ కార్యాలయంలో పని చేస్తున్న శివ, ప్రమీల, త్రివేణి, శ్రావణి, వెన్నెల స్పృహ తప్పి పడిపోయారని తోటి ఉద్యోగులు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. డీఆర్‌ఎఫ్ చీఫ్ ప్రకాష్‌రెడ్డి హ్యాండ్ మైక్ చేతపట్టుకుని భవనంలో **ఉన్న వాళ్లు తమ ఉనికి తెలిసేలా చేయాలని, వీలున్నంత వరకు బాత్‌రూమ్స్ వైపు వస్తే తాము రక్షిస్తామని పదే పదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. తొలుత బీ బ్లాక్‌కు కుడి వైపున అగ్ని కీలకు ఉన్నాయి. దీంతో** చిక్కుకున్న వారికి వెనుక వైపునకు రమ్మని అధికారులు చెబుతూ వచ్చారు. రెస్క్యూ కూడా ఆ వైపున ఉన్న బాత్‌రూమ్స్ సమీపం నుంచే ఎక్కువ చేశారు.

రాత్రి 10.15 గంటలు..

భవనం వెనుక వైపునకూ మంటలు వ్యాపించి తీవ్రత పెరిగింది. దీంతో ఎటు నుంచి రెస్క్యూ ఆపరేషన్ చేయాలి, లోపల చిక్కుకున్న అయిదుగురి విషయంలో ఎటూ తేలని పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు ఆక్సిజన్ ధరించి నేరుగా అయిదో అంతస్తుకు వెళ్లి గాలించారు.

రాత్రి 10.20 గంటలు..

గ్రౌండ్ ఫ్లోర్, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిదో అంతస్తుల్లో మళ్లీ మంటలు పెరిగాయి. ఒకటి, రెండో అంతస్తుల్లో వస్త్ర దుకాణాలు, పాదరక్షల దుకాణాలు ఉండడంతో మంటలు అటువైపూ వ్యాపించాయి. దీంతో భవనం పటిష్టత దెబ్బతిన్నదని భావించిన పోలీసులు రెండు వైపులా ఉన్న అపార్ట్‌మెంట్లు, వెనకవైపు ఉన్న బస్తీవాసులను ఇళ్లలోంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు పంపించారు.

రాత్రి 10.35 గంటలు..

మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి, డీసీపీ చందనా దీప్తి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అతికష్టమ్మీద గ్రిల్స్ తొలగించి అయిదో అంతస్తులోకి వెళ్లిన అగ్నిమాపక శాఖ అధికారులు అపస్మారక స్థితిలో ఉన్న ఆ అయిదుగురిని బయటికి తీసుకువచ్చారు. వీరికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. వీరు అప్పటికే మృతి చెందినట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. అదే సమయంలో మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్ సైతం కన్నుమూశాడు. ఈ ఆరుగురికి కాలిన గాయాలు లేవు. ఊపిరితిత్తుల్లో పొగ చేరడంతోనే చనిపోయారు. మంటలను అదుపు చేసి భవనంలో ఇంకెవరైనా ఉన్నారా..? అనే అనుమానంతో గాలిస్తున్నారు.



ఎమ్మెల్సీ కౌంటింగ్

ఉమ్మడి మహబూబ్‌నగర్ – రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం రాత్రి సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో కొనసాగింది. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ ప్రారంభించారు.



అనంతగిరి: వికారాబాద్ మండలంలో కురిసిన వడగళ్లు





మోమిన్‌పేట: గాయపడిన లక్ష్మి, ఇబ్రాచిట్టంపల్లిలో దెబ్బతిన్న పంట

వడగళ్ల బీభత్సం

ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షాలు గురువారం జిల్లాలో బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా వికారాబాద్, మోమిన్‌పేట, మర్పల్లి మండలాలు అతలాకుతలమయ్యాయి. పలుచోట్ల రెండు గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. వడగళ్లు భారీగా కురవడంతో వందల ఎకరాల్లో టమాటా, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో పొలంలో పనులు చేస్తున్న మహిళా రైతులకు గాయాలయ్యాయి.

– అనంతగిరి/మోమిన్‌పేట/మర్పల్లి



వడగళ్ల వానకు మర్పల్లిలో దెబ్బతిన్న టమాటా పంట

ఈదురుగాలులతో కురిసిన వాన

- పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు
- నేలరాలిన మామిడికాయలు
- ఉల్లి, టమాటా, మొక్కజొన్న పంటలకు అపారనష్టం

అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడినా.. రైతులకు మాత్రం తీవ్ర నష్టాన్నే మిగిల్చింది. వికారాబాద్ మండలంలో గంటకుపైగా ఈదురుగాలులతో వడగళ్ల వాన కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం ఏర్పడింది. మోమిన్‌పేట మండలంలో ఉల్లిపంటకు అపార నష్టం కలిగింది. పొలం పనులు నిర్వహిస్తున్న మహిళా రైతులు వడగళ్ల వల్ల గాయపడ్డారు. ఎన్కేపల్లిలో కె.లక్ష్మి, సయ్యద్‌అల్లిపూర్‌లో కేసారం లక్ష్మికి గాయపడ్డారు. నీటి సరఫరా చేసే పైపులు సైతం పగిలిపోయాయి. ఇదిలా ఉంటే వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు.

యాలాలలో..

యాలాల: మండలంలో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. యాలాల, విశ్వనాథ్‌పూర్, దేవనూరు, ముద్దాయిపేట, రాస్నం, బెన్నూరు, కమాల్‌పూర్‌లో భారీ వర్షం కురిసింది. పలుగ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు.

మర్పల్లి.. తల్లడిల్లి

కురిసిన వడగండ్ల వానకు మర్పల్లి మండలం తల్లడిల్లింది. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నడంతో అపారనష్టం కలిగింది. మర్పల్లి, బూచన్‌పల్లి, కోట్‌మర్పల్లి, వీర్లపల్లి, రావులపల్లి, పెద్దాపూర్, దామస్తాపూర్, షాపూర్, సిరిపురం, పంచలింగాల, పట్లూర్ గ్రామాల్లో టమాటా, ఉల్లి, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మామిడితోటల్లో మామిడికాయలు నేలరాలాయి. వంద ఎకరాల మేర మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. చేతికి వచ్చిన టమాటా, ఉల్లి పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. కోట్‌మర్పల్లి, మర్పల్లి, బూచన్‌పల్లిలో ద్విచక్ర వాహనాలు, కార్ల అద్దాలు పగిలి పోయాయి. పంట పొలాలు, రోడ్లు వడగళ్లతో నిండి పోయాయి. జెడ్పీవైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ కోట్‌మర్పల్లిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటల నష్టాన్ని హార్టీకల్చర్, వ్యవసాయ శాఖ అధికారులతో అంచన వేయిస్తామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.



కోట్‌మర్పల్లిలో పాడైన మొక్కజొన్న పంట

వర్షం తక్కువ.. వడగళ్లు ఎక్కువ

మర్పల్లి మండలంలో వర్షం కంటే వడగళ్లే ఎక్కువ కురిశాయి. మూడు సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. పంటలను, రోడ్లను వడగళ్లు మంచుమాదిరిగా కప్పేశాయి. టమాటా, మామిడి తోటలు, ఉల్లి, క్యాలీఫ్లవర్ ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న వంద ఎకరాల్లో దెబ్బతిన్నది. జొన్న 40 ఎకరాలు పాడైంది. దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదిక ఇస్తాం.

– నీరజ, ఏఈఓ, మర్పల్లి క్లస్టర్



కొపల్లి పరిశ్రమ ఆవరణలో ఎగిసిపడుతున్న మంటలు

జీడిమెట్లలో భారీ పేలుడు

మూసేసిన కొపల్లి ఫార్మా పరిశ్రమలో అగ్నికీలలు

- భయంతో ఇళ్లలోంచి పరుగులు తీసిన స్థానికులు
- ఆర్తనాదాలు, అరుపులతో భయానక వాతావరణం
- సాల్వెంట్‌ల రసాయనాల డంపింగ్‌తోనే ప్రమాదమా?



భయభ్రాంతులతో ఇళ్ల బయటికొచ్చిన స్థానికులు

జీడిమెట్ల: భారీ పేలుడు.. అతిభారీగా చెలరేగిన మంటలతో పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలను అరచేతిలో పట్టుకుని బతుకుజీవుడా అంటూ ఇళ్లలోంచి పరుగులు తీశారు. ఏం జరుగుతోందో తెలియని పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. గురువారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో జీడిమెట్లలో ఇటీవలే మూసివేసిన కొపల్లి ఫార్మా పరిశ్రమ ఆవరణలో భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో ఆ ప్రాంతమంతా భీతిల్లిపోయింది. మోడీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్ వద్ద ఒక్కసారిగా బాంబుల మోతతో సమానంగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించడంతో ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆర్తనాదాలు చేస్తూ ఫ్లాట్లలోంచి కిందికి పరుగులు తీశారు. దాదాపు రెండు గంటలపాటు ఫైర్ ఇంజిన్‌ల శబ్దాలు, పోలీసు వ్యాన్‌ల సైరన్‌లతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. అపార్ట్‌మెంట్ కిటికీల అద్దాలు పగిలిపోయాయి. గురువారం ఈ ప్రాంతంలో కూరగాయల సంత ఉండటంతో అక్కడ ఉన్న కొనుగోలుదారులు సైతం పరుగులు తీశారు.

పేలుళ్లకు కారణమేమిటి?

జీడిమెట్ల ఫేజ్–3లో నాలుగు నెలల క్రితం వరకు కోపల్లి ఫార్మా పరిశ్రమ ఉండేది. ఇటీవలే సదరు పరిశ్రమను యాజమాన్యం వేరే వ్యక్తికి అమ్మేసింది. కొనుగోలు చేసిన వ్యక్తి ఫార్మా పరిశ్రమను పూర్తిగా కూల్చివేశారు. యంత్రాలన్నింటినీ ఇక్కడి నుంచి తరలించారు. స్థానికులు వివరాల ప్రకారం.. రసాయన సాల్వెంట్ డ్రమ్ములను అక్కడే ఉంచి వెళ్లారు. సదరు రసాయనాలు అంటుకోవడంతోనే ఒక్కసారిగా భారీ శబ్దంతో డ్రమ్ములు పేలి 200 మీటర్ల ఎత్తులో గాల్లోకి ఎగిరిపడ్డాయి. ఘటనా స్థలికి బాలానగర్ ఏసీపీ గంగారాం, జీడిమెట్ల సీఐ పవన్, ఎస్సైలు, సిబ్బంది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

30 నిమిషాలకు చేరుకున్న ఫైర్ సిబ్బంది..

ప్రమాదం జరిగిన ప్రదేశం జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు కేవలం 600 మీటర్లలోనే ఉంది. కాని ఫైర్ సిబ్బందికి విషయం తెలియడంతో వారు 30 నిమిషాలు ఆలస్యంగా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కొంతమంది వృద్ధులు ఫ్లాట్లలోని లిఫ్ట్‌లో ఇరుక్కుని మూడు గంటల పాటు అవస్థలు పడ్డారు. వృద్ధులు, పక్షవాతంతో బాధపడుతున్న వారిని ఇళ్లల్లోంచి తీసుకుని వెళ్లలేక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొందరు కార్లు, ద్విచక్ర వాహనాలు తీసుకుని వర్షంలో నగరంలోని చుట్టాల ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొంతమంది వారి పెంపుడు కుక్కలను తీసుకుని ఫ్లాట్లలోంచి పరుగులు తీశారు. రాత్రి 11 గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి



అపార్ట్‌మెంట్ నుంచి పరుగు పరుగున బయటికి

భారీ శబ్దాలతో..



భారీ శబ్దాలు రావడంతో ఏం జరిగిందో తెలియక కంగారుగా అపార్టుమెంట్‌లోంచి బయటకు వచ్చాం. ఒక్కసారిగా పిల్లలు, పెద్దల ఏడుపుల శబ్దంతో అపార్ట్‌మెంట్ మొత్తం రణరంగంగా మారింది. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకుని ప్రజలకు ధైర్యం చెప్పాం.

–లింగారావు, మోడీ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్

అపార్ట్‌మెంట్ పైకి ఎక్కాను..



నేను ఇంట్లో ఉన్నాను ఒక్కసారిగా భారీ శబ్దంతో పాటు ప్రజల అరుపులు వినిపించాయి. బయటకు వచ్చి ఏం జరిగిందో తెలుసుకుందామని అపార్ట్‌మెంట్ పైకి ఎక్కాను. భారీ శబ్దంతో డ్రమ్ములు పేలుతూ అపార్ట్‌మెంట్ వైపు రావడంతో వృద్ధులు కిందకు వచ్చేందుకు సహాయం చేశాం.

– భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఆర్ నాయక్‌నగర్

ఏం జరిగిందో తెలియక..



పది నిమిషాల పాటు ఏం జరిగిందో తెలియలేదు. కిందకు వచ్చాక మూసివేసిన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిందని కొంతమంది యువకులు చెప్పారు. అపార్ట్‌మెంట్ మొత్తం ప్రజల అరుపులతో ఆర్తనాదాలతో దద్దరిల్లిపోయింది. ఇళ్లల్లోకి చేరుకునే వీలు లేకపోవడంతో ఆహారం లేక ఇబ్బందుల పాలయ్యాం.

– ఉషాకల్యాణి మోడీ అపార్ట్‌మెంట్ వాసి

నేలలో పాతిపెట్టిన రసాయన డ్రమ్ములే కారణమా?

కొపల్లిఫార్మా పరిశ్రమలో 2008లో నిషేధిత డ్రగ్స్ తయారు చేసినట్లు తేలడంతో అధికారులు కొన్ని సంవత్సరాల పాటు దీనిని మూసివేశారు. డ్రగ్స్ తయారు చేసే సమయంలో కొన్ని రసాయన డ్రమ్ములను పరిశ్రమ ఆవరణలో భూమిలో పాతిపెట్టి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పరిశ్రమను మొత్తం నేలమట్టం చేయడంతో భూమిలో ఏదైనా రసాయనిక చర్య జరిగి పెద్ద ఎత్తున పేలుడు సంభవించి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది

క్లుప్తంగా

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

పూడూరు: రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రం శివారులోని వివిధ పంటలను పరిశీలించారు. రైతు శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశం సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్బన్ హైడ్రో క్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. 13వ విడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. డబ్బులు రాని వారు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఏఈఓ ఓలు రాంబాబు, ఇలియాస్, రైతులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



మనీషా (ఫైల్)

బషీరాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంతన్‌గౌడ్ తండాకు చెందిన చౌవాన్ లక్ష్మీ బాయి కూతురు చౌవాన్ మనీషా గత నెల 3న ఇంటి నుంచి తాండూరుకు వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వాళ్ల వద్ద వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో తల్లి లక్ష్మీబాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

యాలాల: కాగ్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను యాలాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోకట్ కాగ్నా నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఫలితంపై ఉత్కంఠ

తొలిరౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు

- ఆధిక్యంలో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లికి ఘోర పరాభవం
- అర్ధరాత్రి తర్వాతే తుది ఫలితం!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపు మందకొడిగా కొనసాగుతుండటం.. సాయంత్రం ఆరు గంటల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కాకపోవడంతో అభ్యర్థులతో పాటు ఓటర్లకు నిరీక్షణ తప్పడం లేదు. అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ కూడా మ్యాజిక్ ఫిగర్ 12,709 దాటలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనివార్యమైంది. తుది ఫలితం శుక్రవారం తెల్లవారు జామున వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక గురువారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు.

14 మంది ఎలిమినేటెడ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం రాత్రి 10 గంటల తర్వాత కూడా కొనసాగుతోంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా 15 రౌండ్లు ముగిసే సరికి 14 మంది ఎలిమినేటెడ్‌కు గురయ్యారు. ప్రస్తుతం బరిలో మరో ఏడుగురు ఉన్నారు. సమీప ప్రత్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిపై బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి 1089 ఓట్ల ఆధిక్యతతో ఉన్నారు. రాత్రి పది గంటల వరకు ఏవీఎన్‌రెడ్డికి 7,899 ఓట్లు రాగా, చెన్న కేశవరెడ్డికి 6,810 ఓట్లు పోలయ్యాయి. మాణిక్‌రెడ్డికి 4,880 ఓట్లు రాగా, హర్షవర్ధన్‌రెడ్డికి 2,088 ఓట్లు, కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి 1,328 ఓట్లు, భుజంగరావుకు 1,199 ఓట్లు, కాసం ప్రభాకర్‌కు 827 ఓట్లు పోలయ్యాయి.

కాటేపల్లికి ఘోర పరాభవం

ఉపాధ్యాయ సంఘాల్లో తెలంగాణ ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) అత్యధిక సభ్యత్వాన్ని కలిగి ఉంది. అధికార పార్టీకి అండదండలు ఈ సంఘానికి పుష్కలంగా ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి నుంచి ఈ సంఘానిదే హవా కొనసాగుతూ వచ్చింది. రెండు ఎన్నికల్లో ఇదే సంఘం నుంచి పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి ఈ ఎన్నికలో ఘోర పరాభవం ఎదురైంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు అతి తక్కువగా 1,236 మాత్రం రావడం గమనార్హం. టీపీఆర్‌టీయూ నుంచి కాటేపల్లి పోటీ చేయగా, పీఆర్‌టీయూ టీఎస్ నుంచి చెన్నకేశవరెడ్డిలు పోటీ చేశారు. ఇలా ఇద్దరు ఒకే సంఘం నుంచి బరిలోకి దిగారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా పని చేసిన కాటేపల్లిపై ఉపాధ్యాయ వర్గాల్లో ఉన్న వ్యతిరేకత ఏ మేరకు ఉందో స్పష్టమవుతోంది. ఎమ్మెల్సీగా 317 జీఓ, స్పౌజ్ కేసుల బదిలీలు, విద్యారంగం సమస్యలపై శాసన మండలిలో ఏనాడు కూడా ప్రస్తావించకపోవడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడం, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వ పెద్దలతో అంటకాగటాన్ని సొంత సంఘం నేతలే కాదు సభ్యులు సైతం జీర్ణించుకోలేక పోయారు.

ఓటింగ్‌లో పంతుళ్లు ఫెయిల్

ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సరిగా ఉపయోగించుకోలేక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటు వేసిన వారిలోనూ కొంత మంది తమ నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు. నిర్దేశించిన విధంగా ఓటు వేయకపోవడం, అభ్యర్థికి ఎదురుగా ఉన్న ఓటింగ్ బాక్సుకు వెలుపల ఓటు ముద్రను వేయడం వల్ల 452 ఓట్లు చెల్లకుండా పోయాయి. కాగా, అర్ధరాత్రి తర్వాతే ఫలితాలు వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు

అటెండర్ ఆత్మహత్య



మట్ట కిషోర్ (ఫైల్)

బ్యాంక్ మేనేజర్ వేధింపులే కారణం

కందుకూరు: బ్యాంక్ మేనేజర్ వేధింపులు భరించలేక అటెండర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ధన్నారం గ్రామానికి చెందిన మట్ట కిషోర్(35) లేమూరులోని కెనరా బ్యాంక్‌లో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బ్యాంక్ మేనేజర్ నిహారిక కొన్ని నెలల క్రితం కిషోర్ భార్య పేరుతో రూ.1.50 లక్షల రుణం తీసుకుని వాయిదాలు చెల్లించడంలేదు. దీంతో ఆ డబ్బులు కిషోర్ భార్య ఖాతా నుంచే చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయమై నిలదీయడంతో మేనేజర్ రుణాన్ని తన పేరుపై బదిలీ చేసుకుంది. అప్పటి నుంచి కిషోర్‌పై కక్షగట్టి వేధింపులు ప్రారంభించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిషోర్ బుధవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, అక్కడే మృతుడి కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్‌కు దానం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు వాహనాల వేలం

కొడంగల్: స్థానిక అబ్కారీ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ సైదులు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి వున్న వారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుకు ఆయా రంగాల్లోని మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. గురువారం ఆయా విభాగాల్లో పనిచేస్తున్న మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుపై అవగాహన కల్పించారు. ఆయా రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు ఇస్తారని తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారు చేయడం వంటి విభాగాల నిర్వహణలో ప్రతిభ ఉన్న మహిళలు వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తారన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి



కోల్కుంద గ్రామంలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

మోమిన్‌పేట: అకాల వర్షంతో ఉల్లికి అపార నష్టం జరిగిందని జెడ్పీ వైస్ చైర్మన్ బీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రాయన్‌పల్లి, కొల్కుంద, చిన్నకోల్కుంద గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న ఉల్లి పంటను డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి గఫూర్‌తో కలిసి పరిశీలించారు. కూరగాయలు, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులను ఆయన కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సయ్యద్ యూసఫ్ అన్నారు. మండలంలోని కామునిపల్లికి చెందిన సీ మహేశ్ 5నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మహేశ్.. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతా తెరవడంతో పాటుగా ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన రూ. 20 లక్షలను గురువారం బ్యాంక్ అధికారులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ అతి తక్కువ ప్రీమియంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక చిన్న ఆలోచన వారి కుటుంబానికి ఎంతో గొప్ప సహకారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక పరమైన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సతీష్, ఎస్ఎంఓ మచ్చన్న, ఎస్ఎంటీ వెంకటస్వామి, ఎస్‌బీహెచ్ మేనేజర్ రమేష్, ఏపీఎం శోభా, సర్పంచ్ మైపాల్ రెడ్డి, రజక సంఘం జిల్లా కార్యదర్శి మోత్కూరు వెంకటేష్, నాయకులు బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గణేష్, రాము పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- పట్టుదలతో చదివి లక్ష్యం చేరుకోవాలి
- డీఎస్పీ శేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

పెద్దేముల్: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి నేతృత్వంలో ఆర్థిక, మానసిక, విద్య, ఆరోగ్యం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోగలమని పేర్కొన్నారు. సమాజంలో చదువుతో పాటు డబ్బు ఉంటేనే గౌరవం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చిన్ననాటి నుంచే డబ్బు సంపాదించడం నేర్చుకోవాలన్నారు. సమాజంలో తరతరాలుగా గుర్తించే విధంగా ఎదగాలన్నారు. ప్రతి వ్యక్తి ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గుర్తించి వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలకు ప్రోత్సహించరాదన్నారు. మహిళలు, బాలికలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైన వేధిస్తే డయల్ 100కు, లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ అన్వేష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులు శాంతప్ప, అక్కమదేవి, ఏఎస్ఐ నారాయణ, హెచ్ కానిస్టేబుల్ మల్లేశం, షీటీం కానిస్టేబుల్ మమత, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

బషీరాబాద్: వైన్ షాపులో చోరీ జరిగిన సంఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని మణికంఠ వైన్ షాపు పైకప్పు రేకులను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి లోనికి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉంచిన రూ. 30వేల నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం షాపు తెరిచిన నిర్వాహకులు చోరీ జరిగిన విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

పెద్దేముల్: అదుపు తప్పి ట్రాక్టర్ గుంతలో పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ శివారులోని పత్తి కాటన్ మిల్లుకు వచ్చింది. పత్తి లోడు ఖాళీ చేసి తిరిగి వెళుతుండగా గాజీపూర్ సమీపంలో మొరం గుంతలో పడింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. క్రేన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటికి తీశారు.

స్వామిజీపై చీటింగ్ కేసు



నిందితుడు హరికృష్ణ (స్వామిజీ)

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా, మోసపూరితంగా ప్రజల నుంచి డబ్బులు తీసుకున్న స్వామిజీపై కేసు నమోదైంది. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వడ్డీ లేకుండా అప్పులు ఇస్తున్నాం అంటూ ప్రజల్లో మోసపూరిత ప్రకటనలు చేసిన స్వామిజీపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టారు. స్వామిజీ నిర్వహించిన ప్రక్రియ మొత్తం ప్రజలను మోసంచేసేవిధంగా ఉందని నిర్ధారించారు. స్వామిజీగా ప్రచారం చేసుకుంటున్న జాకారం హరికృష్ణ అలియాస్ రుద్ర(31) తండ్రి భీమయ్యపై 420కేసు నమోదు చేశారు. స్వామిజీకి ఎవరైనా డబ్బులు ఇచ్చిట్లయితే శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ గిరి పేర్కొన్నారు. స్వామిజీకి 66 మంది డబ్బులు ఇవ్వగా వారిలో 19మందికి మాత్రమే లబ్ధి జరిగింది. మిగిలిన 47మంది తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

యాప్ ఆధారంగానే జీతాలు

ఆలస్యంగా వచ్చే సిబ్బందిపై దృష్టిసారించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్‌లో రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల వేతనాలు అటెండెన్స్ యాప్ ఆధారంగానే వేతనాలు ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియో అటెండెన్స్ యాప్ ప్రకారమే జీతాలు ఇవ్వాలని, జీతాల బిల్లులు చేసే ముందు సంబంధిత డ్రాయింగ్ అధికారులు ఈ నెల 22లోపు కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. జిల్లా వైద్య శాఖ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఓ, రెవెన్యూ శాఖల్లో ఎక్కువగా గైర్హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏవైనా టెక్నికల్ సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యాలయాలకు ఆలస్యంగా వచ్చేవారు, సమయానికంటే ముందే వెళ్లేవారు.. డివియేషన్ అయ్యే వారిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఐదు రోజుల కంటే ఎక్కువ డివియేషన్ ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మూడు రోజుల కంటే ఎక్కువ ఆలస్యంగా వచ్చిన వారిని గైర్హాజరుగా పరిగణించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అటెండర్ నుంచి అధికారి వరకు ప్రతి ఒక్కరూ కార్యాలయానికి సకాలంలో హాజరు కావాలన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో తప్పకుండా ఫోటోకాల్ పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే తనను ముందుగానే సంప్రదించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం కష్టపడి పనిచేసి జిల్లాను టాప్-5లో ఉంచాలని సూచించారు.

బ్రిడ్జి సమస్య పరిష్కారానికి కృషి

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పట్టణంలోకి వచ్చే ప్రధాన బ్రిడ్జి నిర్మాణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. గురువారం ఆయన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం పనులకు ఇప్పటికే రూ.12కోట్లు మంజూరు అయినప్పటికీ పనుల జాప్యంపై ఆరా తీశారు. త్వరగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్ వాహిద్ ఖాతూన్, ఆర్ అండ్ బీ డీఈ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇంజనీర్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

మనం పని చేయకుంటే ప్రజలకు నష్టం

- గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలి
- ఉపాధి కూలీలకు పనులు కల్పించండి
- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. బాధ్యతాయుత పదవుల్లో ఉన్న మనం పని చేయకుంటే ప్రజలకు నష్టం కలిగించిన వారమవుతామని అన్నారు. గురువారం వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలకు పల్లె ప్రగతి, జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, ప్రభుత్వ లక్ష్యాల అమలుపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమర్థవంతమైన పాలన సాగాలనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చిందన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో హరితహారం, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు, చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు చేపట్టి ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. పనిచేసే సిబ్బందికి తమ సహకారం ఉంటుందన్నారు. వారం, పది రోజుల్లో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎఫ్ఏలకు సిమ్ కార్డులను అందజేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఏపీడీ సరళాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



పెద్దేముల్: హృదయ శ్వాస పునరుజ్జీవన చర్య (సీపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మాస్టర్ ట్రైనర్ డాక్టర్ గోపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఎవరైనా అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు వారికి కృత్రిమ శ్వాస కల్పించి ప్రాణాన్ని దక్కించాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సరైన వైద్యం అందేవరకు సీపీఆర్ చేయడం ద్వారా 90 శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బుచ్చిబాబు, సూపర్‌వైజర్ పుష్పలత, ఆస్పత్రి సిబ్బంది హరిశంకర్, సంతోష్‌కుమార్, స్వప్న, నర్సుబాయి, లలితాదేవి, వెంకటలక్ష్మీ, వెంకటమ్మ, సోని, స్వర్ణకుమారితో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు



రోడ్డు పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి నుంచి తొండుపల్లి వరకు రూ. 5.80కోట్లతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజూ పనులను అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రాఘవాపూర్ సర్పంచ్ జగన్, నాయకులు హన్మంతురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ చైర్‌పర్సన్‌కు 13 ఫిర్యాదులు

వికారాబాద్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసమే డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. గురువారం నిర్వహించిన 'డయల్ యువర్ చైర్‌పర్సన్'కు 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. గత వారం కూడా 13 ఫిర్యాదులు రాగా వాటిలో మూడు సమస్యలు శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. మిగతా సమస్యలు పరిష్కార దశలో ఉన్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో ప్రధానంగా డ్రైనేజీ, శానిటేషన్, వీధిలైట్లపై వస్తున్నట్లు తెలిపారు. వీటిని త్వరగా పరిష్కరించేందుకు ఆయా విభాగాల అధికారులను ఆదేశించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.